# మమర్శనీ

## మధురాంతకం రాజారాం




"సుందరవిలాస్ భోజన కాఫీ హోటల్ ప్రొప్రయిటరు గారికి మద్రిపాడు వాస్తవ్యుడు దొక్కా భోగిరాజు వ్రాసుకున్న జాబు—

వూరూ, పేరూ చూచి—'ఏ డెవడబ్బా?' అని మీరు ఆశ్చర్యపడే అవకాశం లేకపోలేదు. ఎవడో అపరిచితుడు ఇలా చొరవగా ఒక జాబు రాసి పడేసినందుకు మీకు ఆగ్రహం గూడా కలగొచ్చు. మీకూ, నాకూ ఉన్న సంబంధాన్ని గురించి తెలుసుకోడానికి ముందు మీకు నే నొక చిన్న పిట్ట కథ మనవి చేసుకోవాలి. మునుపటి కొక అజ్ఞాత వ్యక్తి ఒక ఇంట్లో ప్రవేశించి, పది పదిహేను రోజులవరకు అక్కడే తిష్ఠ వేసి, దుష్టుగా ఆతిథ్యం స్వీకరించాడట. భార్యవైపు చుట్టమేమోనని భర్త, భర్తవైపు చుట్టమేమోనని భార్య అనుకున్నారట. చివరకు భార్యా భర్తలిద్దరూ కూడబలుక్కుని 'అయ్యా! తమ రెవరో తెలుసుకోవాలని వుంది' అని విజ్ఞాపనం చేసుకున్నారట. అప్పుడా అతిథి సత్తముడు చిరునవ్వు నవ్వి, 'అబ్బే! దానికేముందిలెండి! మా ఇంటిపెరట్లో ఒక రేగు చెట్టుంది. మీ ఇంటి పెరట్లోనూ ఒక రేగు చెట్టుంది. అదే మనకున్న సంబంధం' అని చెప్పి, తన దారిని తాను చక్కా పోయాడుట. చెప్పొచ్చిందేమంటే... మీతో నాకున్న సంబంధం ఏవిధంగా చూసినా ఆ బాదరాయణ సంబంధంకన్నా తక్కువది గాదు. ఎలాగంటారా? పరబ్రహ్మ స్వరూపమైన అన్నానికి ఒకవైపున మీరు, ఇంకొకవైపున నేను. ఆహార పదార్థాలకు వినియోగదారుల్ని సంపాదించడం మీ సమస్య. సదరు ఆహారాన్ని సంపాదించడమే నా సమస్య.

మానవుణ్ణి పుట్టింది మొదలు వెన్నంటి ఉండేది ఏదని ప్రశ్నిస్తే వేదాంతులు 'మృత్యువు' అని చెబుతారు. అయితే, మృత్యువనేది జన్మకల్లా శివరాత్రిలా ఒక ప్రాణికి ఎప్పుడో ఒకసారి మాత్రమే ఎదురవుతుంది. దాన్ని గురించి అట్టే చింతించవలసిన అవసరం లేదని నా నమ్మకం. మనిషిని నీడలా అంటిపెట్టుకుని ఉండేది 'ఆకలి' అంటే అది ఎంతైనా సత్య సమ్మతం. భగవంతుడి లీలలు అనంతం అంటారు. అట్లాగే ఆకలి లీలలున్నూ అనేకం. కొందరి విషయంలో ఆకలి ఒక వూహ, అనుభవం కాదు. ఇంకా మాట్లాడితే ఆకలి కాకపోవడమే వాళ్ళకు ప్రబల సమస్య. మరి కొందరు ఎప్పటి కప్పుడు ఆకలికి పరితృప్తి చేకూర్చగలరు.

వాళ్ళ దగ్గర అది కర్ర చూపించగానే పారిపోయే పిల్లిలా మసలుకుంటుంది. అక్కడ దాని పప్పు ఉడకదు. మరి కొందరికి సంబంధించినంతవరకు వాళ్ళ రెక్కకూ, డొక్కకూ తీరని లంకె. రెక్కలాడని పరిస్థితి ఏర్పడితే వాళ్ళ బ్రతుకు కుక్కలకన్నా హీనం. వాళ్ళ పాలిటికి ఆకలి సాక్షాత్తూ పెద్ద పులి. కళ్ళెర్ర చేస్తుంది. భయంకరంగా గాండ్రిస్తుంది. 'గావు' ఇవ్వకపోతే మింగేస్తానంటూ నోరు తెరుస్తుంది. ఈ ఆకలి పులితో సహజీవనం చేస్తూ, పూట పూటా ఒక గండంగా కాలం గడిపే దిక్కూ మొక్కూ లేని వాళ్ళు వేనకు వేలు. వాళ్ళు జనభా లెక్కల్లో తమకు చోటు లేకపోయినా విచారించరు. వోటు హక్కు లేకపోయినా కుమిలిపోరు. దేశ ప్రగతిని గురించి ప్రశ్నించనే ప్రశ్నించరు. ఆకలైతే పిడికెడన్నం మాత్రం అడిగేస్తారు. ఈ వర్గీకరణలో నేను దేనికి చెంది వుంటానన్న సందేహం ఈపాటికి మీలో పొడసూపి ఉండచ్చు. మొదటి రెండు తరగతుల్లో చేరడం గురించి కలగనడానికైనా నా స్థితిగతులు నన్ను అనుమతించవు. అలాగని అచ్చంగా చివరి విభాగానికి చెందిన వాడినని చెప్పుకోలేను. చివరి కాటగిరీలో వాడి కొంచెం పైగ్రేడు.

నిజంగా ఆకలితో ఉండి గావచ్చు, భోజన వేళయిందిగదా— ఏదైనా తినక తప్పుతుందా అన్న యాంత్రికమైన అలవాటువల్ల గావచ్చు. కేవలం జిహ్వ లోలు పత్వంవల్ల గూడా కావచ్చు— ఏ కారణంవల్లనైతేనేమి—మీ హోటలు ఎప్పుడూ జనంతో కిటకిటలాడి పోతూ ఉండాలని మీ రాశిస్తారు. వాళ్ళను దృష్టిలో ఉంచుకుని మీరు కావలిస్తే 'ఆకలి ఆరోగ్య లక్షణం. రండి, విచ్చేయుండి. స్వాగతం సుస్వాగతం ! !' అంటూ బోర్డు రాయించి మీ హోటలు ఎదుట పెట్టించ గలరు. కానీ, ఆకలి మాత్రమే ఉండి, దానికి సంతృప్తి చేకూర్చే స్తోమత ఏమాత్రంలేని అభాగ్యుల్ని గురించి నేను చెబుతున్నాను. వాళ్ళు మీ హోటలు లోపల ఉండరు. ద్వారం దాటి లోపలికి రారు. మస్సుగా తిని, త్రేన్పుతూ ఈవలి కొచ్చే కస్టమర్ల కెదురుగా రోడ్డుపైన నిలబడి ఉంటారు. గడచిన శుక్రవారం సాయం కాలం నాలుగు గంటల ప్రాంతంలో నేను గూడా వాళ్ళల్లో ఒక్కణ్ణిగా ఒకటి రెండు నిమిషాలపాటు మీ హోటలు ముంగిట నిలబడ్డాను. అయితే



# హోటే ళోడుగోల్వం

—కె.జి. నటేశన్ (తిరుచి)

నేనెప్పుడు వాళ్ళు చెయ్యని, చెయ్య లేని పని ఒకటి చేశాను. నేనా పని గనుక చేయకపోయివుంటే ఇప్పుడీ జాబు రాయాల్సిన అవసరం నాకు గానీ, దీన్ని చదవాల్సిన ఆవశ్యకత మీకు గానీ కలిగి వుండేదిగాదు.


అసలేం జరిగిందంటే—కథ మొదటి మంచీ మనవి చేస్తాను—అవధరించండి.

నేను మధ్యాహ్నం బయల్దేరింది గురువారం ఉదయాత్పూర్వం అయిదు గంటలకు. బయల్దేరిన వేళా విశేషం గురించి నే నాలోచించలేదు. ప్రతి నెలా చేసే ప్రయాణమే. ట్రెజరీలో బిల్లు పాసుకావడం, కొంచెం ముందో వెనుకో అదెలాగూ అవుతుంది, ఆ మాత్రానికి పంచాంగ పరామర్శ ఒకటా !

"ఏమండీ! రాత్రి గూడా సరిగ్గా భోజనంలేదు. జేబులో డబ్బులు గూడా అంతంతమాత్రం గానే ఉన్నాయి. మీ

రసలే ఆకలికి తట్టుకోలేరు...' అంటూ మా ఆవిడ కొంతదూరం నన్ను వెన్నంటి వచ్చింది.

ఆవిడ చెప్పినవల్లా మూడు వాక్యాలే. కానీ వాటిని విస్తరించి పురాణాలుగా చెప్పొచ్చు. అయితే అందులో ఆనందం కలిగించేదేమీ ఉండదు. చూసి చూసి దుఃఖాన్ని ఎవరు కొనుక్కుంటారు ? మీ రీ ఉత్తరాన్ని మధ్యలోనే చించి బుట్టదాఖలు చేస్తారేమోనన్న భయం నాకుంది. అందువల్ల నా ఈ బాధల నన్నింటినీ త్రవ్వి మీముందు రాసిగా పోయడం నా కిష్టంలేదు. ప్రస్తుతాని కవసరమైనంతవరకే వెల్లడిస్తాను. పూర్వాశ్రమంలో నేను ఒక చిన్న బడిపంతుల్ని. ఉద్యోగంనుంచీ విరమణ పొంది రెండేళ్ళయింది. ఉద్యోగం చేస్తున్నవాళ్ళకు, ఉద్యోగం చేసి రిటయిరైనవాళ్ళకు, ఉద్యోగం చేస్తూ మరణించిన వాళ్ళ కుటుంబాలకు గవర్నమెంటు తనకు వీలైనంతలో డబ్బులు ముట్టజెపుతుంది. నా వంతుకు నాకూ వంద రూపాయల పింఛన్ చేతికొస్తుంది. ఇంట్లో ఉన్న జీవాలం నేనూ, మా ఆవిడ ఇద్దరమే. నాలుగ్గోడల మధ్య తల దాచుకుంటూ, ముప్పూటలా తిన్న శాస్త్రం చెల్లిస్తూ, మేము గుట్టుచప్పుడుగా బ్రతక గల్గుతున్నామంటే ఇదంతా ఆ వంద రూపాయల చలవే! అదనంగా ఖర్చులు తగిలితే తప్ప నేను వీధినబడే పరిస్థితులు లేవని ఒప్పుకుంటాను. కానీ ఎంత జాగ్రత్తగా మసలుకున్నా అప్పుడప్పుడూ ప్రమాదాలు తప్పడం లేదు. ఫామిలీ ప్లానింగు మీద ఇంతగా ఒత్తిడిలేని రోజుల్లో నేను ముగ్గు రాడ బిడ్డలకు తండ్రినయ్యాను. ఎక్కడో దూరంగా వాళ్ళ కాపురాలు వాళ్ళు చేసుకుంటున్నారనుకోండి! అయినా, ఆడపడుచులు చుట్టపు చూపుగా వచ్చి పుట్టింట్లో కొద్ది రోజులుండడం ఒక నేరంగా ఏ శిక్షాస్మృతీ చెప్పడం లేదు. నేనూ అలా అనుకోలేను. గడచిన నెల మా ఇంట్లో జరిగిందదే. మా చిన్నమ్మాయి ఇద్దరు బిడ్డలతో బాటుగావచ్చి పది రోజులుండిపోయింది. ఆమెకు మృష్టాన్నాలు వండి పెట్ట లేదు. రొక్క రోజనాలు మూట గట్ట లేదు. మేము తినే భోజనమే వాళ్ళకూ కొంచెం పెట్టాము. లేదంటే రాక రాక వచ్చిందిగదా అని ఒక చీరా, జాకెట్టూ పెట్టుకోవలసి వచ్చింది. ఇంతే సంగతులు. ఈ లోటు బడ్జెట్టులో నుంచీ బయటపడడం మా చిన్న కుటుంబం పాలిటికి బ్రహ్మ




ప్రళయమైపోయింది. కుండలో బియ్యం ఖాళీ. జేబులో డబ్బులు ఖాళీ. బదులూ, పదులూ చేస్తూ మా ఆవిడ ఎలాగో రోజులు నెడుతూ వచ్చింది. మొదటి తేదీకంతా పట్నంలో వాల వలసిందే! కానీ నెలలో మొదటి మూడు రోజులు రెగులర్ బిల్లులు మాత్రం పాసు చేయడం ట్రెజరీ వాళ్ళ నియమం. పింఛన్‌దార్లకు నాలుగు, అయిదు తేదీలు కేటాయించారు. ఇన్ని రోజులే గడిచాయి. ఇంకొక మూడు రోజులు ప్రాణాలు ఉగ్గబట్టలేక పోతామా? సరే, ఆ మూడు రోజులూ గడిచాయి. నాలుగో తేదీ ఉదయమే టవునుకు ప్రయాణం పెట్టుకున్నాను.

నేను రోడ్డుపైకి వచ్చేసరికి కొద్ది నిమిషాల క్రితమే మొదటి బస్సు వెళ్ళి పోయినట్టు తెలిసింది. రెండో బస్సు రాకను గురించి ఎవరికీ సరైన అవగాహన ఉన్నట్టు లేదు. అది ప్రయాణీకుల అదృష్టదురదృష్టాలపైన ఆధారపడి ఉంటుం దన్నారు. ఏడు గంటలకే బస్సు దొరికింది గనుక అప్పటివరకూ నా అదృష్టం బాగున్నట్టే లెక్క.

బస్ స్టాండులో దిగేటప్పటికి నా జేబులో కొన్ని చిల్లర డబ్బులుమాత్రం మిగిలాయి. లెక్కపెట్టలేదుగానీ, ఒక రూపాయిదాకో ఉండొచ్చు. టవునులో అడుగు పెట్టేటప్పటికి అంతకు మించి నా దగ్గర మిగలక పోవడం మామూలే! పరవాలేదు. బిల్లు పాసు కాగానే హోటలుకువెళ్ళి భోజనంచెయ్యొచ్చు. ఒక పూట భోజనానికి మూడు రూపాయలుపెట్టడం నాబోటి వాడికి తలకు మించిన వైభోగమే! కానీ తప్పనిసరి. నెలకంతా కలిసి ఒక పూట అయినా సాంగోపాంగంగా భోజనంచేసి నట్టుంటుంది. అదయినా ఎంతటి వరం!

బస్‌స్టాండునుంచీ ట్రెజరీకి వెళ్ళే వాళ్ళు రిక్షాలో, ఆటోలో, బస్సులో చూసుకుంటారు. నేను మాత్రం నా పరిమితిని గుర్తులోపెట్టుకుని ఎప్పుడూ నడిచే వెళ్తాను. పదిన్నరకు వెళ్ళినా చాలు—ఆఫీసులన్నీ మేలుకోవడం అప్పుడే మరి.

పదకొండుకు దరిదాపుల్లో ఆఫీసు ప్రాంగణంలో అడుగు పెట్టే ఉంటాను. అప్పటి కక్కడ కార్యాలయాలేవీ నిద్ర మేల్కొన్న సూచనలు లేవు. ఈ పాటికి వసారాలోను, చింతచెట్ల నీడల్లోనూ జనం క్రిక్కిరిసి ఉండవలసింది. పలచగానైనా జన సంచారం లేకపోతే ఏమను కోవాలి? మూసిన కనురెప్పల్లా కిటికీలన్నీ బందు. ముఖద్వారం తాలూకు రెక్క తలుపుల్లో ఒక్కటి మాత్రం తెరచి ఉంది. వసారా వెంట అటూ ఇటూ నాలుగైదుసార్లు తిరిగి చూచాను. ఇక నడిచే ఓపిక లేక చింతచెట్టు బోదె చుట్టూ కట్టిపెట్టిన రచ్చపైన చతికిల పడ్డాను.

భగవంతుడా! ఏ కారణం వల్లనైనా ఈ రోజు ఆఫీసుకు సెలవైతే నా గతేం కావాలి?

ఎవరినైనా అడిగి ఉండొచ్చు. తీరా అడిగితే నా అనుమానం కాస్తా నిజమై కూచుంటుం దేమో?

తెరచి ఉన్న తలుపునుగూడా మూసి తాళం బిగించిన తర్వాత బంట్రోతు ఒకతను తిరిగి వెళ్తూ వెళ్తూ నావైపు ఎగాదిగా చూశాడు.

"ఏమండీ! ఈ రోజు ..." అప్రయత్నంగా నా పెదవి విడివడింది.

"ఏమయ్యా ఆఫీసుకొచ్చావా ఏమిటి? మంచి ఎర్రిబాగులోడివే! ఈ రోజు అంబేద్కర్ జయంతయ్యా, బాబూ! హాలిడే ..."

అనుకున్నంతా అయింది. గాలి తీసేసిన బెలూనులా చింతచెట్టు బోదెకు చేరగిలబడి కూర్చుండిపోయాను. ఏం చేయాలి, ఎక్కడికి వెళ్ళాలి అన్నది తక్షణ సమస్య. ఈ నీడపట్టు కూడా వదిలిపెడితే, టవునులో ఈ మాత్రం ఆశ్రయం దొరకడం కూడా దుర్లభమే!

చుట్టూరా ఎండ చురచురలాడి పోతూ ఉంది.

చింతచెట్టు కొమ్మల్లో రెండు ఉడతలు కిచకిచలాడుకుంటూ చింతకాయల కోసం కాబోలు తిరుగుతునాయి. ఇటుకరాళ్ళ కుప్పలోనుంచి ఈవలికి వచ్చిన తొండ ఒకటి ఏదైనా ఒక పురుగును కబళించాలని చూస్తోంది. ప్రహరీ గోడ దాపున రెండు కుక్కలు దేనికోసమో కొట్లాడు కుంటున్నాయి. వీధిలో ఒక బిచ్చగాడు హృదయ విదారకంగా 'అమ్మా, అమ్మా' అని అరుస్తున్నాడు. ప్రాణి లోకమంతా ఆకలి చల్లార్చుకునే మహా యజ్ఞంలోనే నిమగ్నమైనట్టుంది.

జేబులో ఉన్న డబ్బుతీసి చూసుకున్నాను. రూపాయి కన్నా పది పైసలు ఎక్కువగానే ఉన్నట్టు తేలింది. సరిగ్గా ఇంక ఇరవై నాలుగు గంటలు గడిస్తేగానీ నేను తిండి ముఖం చూడడం జరగదు. ఈ ఇరవై నాలుగు గంటలకుగాను ఈ నూట పది పైసలే ఆధారం. తక్కువ ఉ[illegible] ఆహారం సంపాదించే పథకం కోసం నా బుర్ర నిర్విరామంగా పనిచేస్తోంది. వేరుశనగకాయలు ... అరటిపళ్ళు ... బన్‌రొట్టె అబ్బే, వాటికంటే శనగపప్పే నయం. గుప్పెడు గుప్పెడు పప్పు తిని, మిగిలిన కడుపుకు నీళ్ళు పట్టిస్తూ ఉండొచ్చు.

పొద్దు వాటారిన తరవాత లేచి వెళ్ళి దగ్గరగా ఉన్న కొట్లో అరపడి శనగపప్పు పొట్లం కట్టించు కున్నాను. తిరిగి వచ్చి పంపు దగ్గర ముఖం కడుక్కుని ముందుగా కొన్ని నీళ్ళు పట్టించాను. చింతచెట్టు కింద యథాస్థానాన్ని ఆక్రమించి ఒక్కొక్కటిగా పప్పు నోట్లో వేసుకుంటూ భోజనం చేయడానికి ఉపక్రమించాను. ఇప్పుడో అర తవ్వ. రాత్రి భోజనం కింద ఒక తవ్వ. రేపటి ఉదయం ఉపాహారానికి మిగిలిన అరతవ్వ. ముఖ్య గమనిక: స్టాకు తొందరగా తరిగి పోకుండా ఉండేటట్టు చూసుకోవాలి.

ఆరోజు రాత్రి నాకు కలిగిన ఆలోచనలన్నింటినీ ఏకరువు పెడుతూ మీ ఓపికకు పరీక్ష పెట్టలేను కానీ, సంగ్రహంగానైనా చెప్పాలి. ఆ రాత్రి వేళ నాకులఆకాశంలో వెలిగే చుక్కలు తినడానికి పనికిరాని నిప్పుకణికల్లా కనిపించాయి. చంద్రబింబం శూన్యంగా పొయ్యి మీద కాగుతున్న పెనములా కనిపించింది.. వెన్నెల వేడి సెగలా తోచింది. చెట్లు నోరు తెరచి మింగేయడానికి వచ్చే ఆకొన్న భూతాల్లా భయపెట్టాయి. ఈ దృశ్యాలేవీ చూడలేక కళ్ళు మూసుకుంటే లోపలి కళ్ళకు పట్టెడు పచ్చడి మెతుకులే కనిపిస్తూ వచ్చాయి.

ఎట్లాగో తెల్లవారింది.

పంపు దగ్గర దంత ధావనం గావించి, ముఖప్రక్షాళనం ముగించి, పొట్లంలో ఉన్న శనగపప్పుకూడా ఖాళీ చేశాను. తావు మార్చితే మంచిదేమోనని వసారాలోకి వెళ్ళి బెంచీ పైన కూచున్నాను.

క్రితం రోజు చల్లటి వార్త చెప్పి పోయిన బంట్రోతు తొమ్మిదిగంటల కల్లా వచ్చేశాడు. అత డింకా తాళం తీస్తూ ఉండగానే, ఒకావిడ చీపురు చేతపట్టుకుని మెట్లపైన ప్రత్యక్షమైపోయింది.

'అదేం టయ్యోవ్! నువు నిక్కుతూ నీల్గుతూ తొమ్మిదిగంటల కొస్తే నే నీ లంకంత ఆఫీసుఎప్పుడూడవాలని?' ఆవిడ సాగదీసింది.

'పరవాలేదులే, సుబ్బులమ్మా! నిదానంగానే వూడువు. ఈ రోజుకూడా ఆఫీసుండడం అనుమానమేలే.'

నా గుండెలో రాయి పడింది.

అబ్బే, ఉండదుండదు. ఈరోజుకూడా సెలవా? ఏం మాట! నా చెవులే నన్ను మోసగించి ఉండాలి.

'బాగానే ఉందిలే సంబడం. ఈ రోజెందుకనట సెలవు?' నా గుండెలో ప్రశ్నే సుబ్బులమ్మ నోటి గుండా ప్రతిధ్వనించింది.

'ఎవురో పెద్దాయన శిళ్ళు మూశాడటలే, సుబ్బులమ్మా! స్కూళ్ళకూ, ఆఫీసులకూ సెలవిస్తున్నట్టు ఉదయం వార్తల్లో సెప్పినారంట.'

అంతే. పక్కకు వాలి అట్లాగే నేను బెంచీ చెక్క పైకి సోలిపోయాను.

దయ దలిచి నాకు అన్నం పెట్టగలిగిన పరిచితు లెవరూ పట్నంలో లేరు. పరిస్థితులు వివరించి ప్రాథేయ పడడానికి అభిమానం ఒప్పుకోదు. ఇంకొకరోజంతా పట్టె మంచి నీళ్ళతో ప్రాణాలు నిలుపుకోవడం సాధ్యం కాదు. ఏం చేయాలి? ఏం కావాలి?

మూసిన ఇంట్లో ముంత పొగ బెట్టినట్టుగా కడుపులో ఆకలి ఆవిరులు గుక్కుతూంది.

పేగులు గీ పెడుతున్నాయి.

నీరసం వల్ల ఉండీ ఉండీ ఒళ్ళంతటా చెమటలు పోస్తున్నాయి.

ఏ దైవికమైన కారణం వల్లనైనా ఆఫీసు పని చేస్తుందేమో నన్న ఆశ క్రమ క్రమంగా అడుగంటింది.

మానవుడు మానసికంగా క్రుంగిపోవడానికి, జీవితం పట్ల విరక్తిని పొందడానికి ఎంతో వ్యవధి అక్కర్లేదని ఇప్పుడు నేను స్వానుభవం ద్వారా చెప్పగలను. మధ్యాహ్నం మూడు గంటలయ్యేటప్పటికి ఇంచుమించుగా ఉన్మాదావస్థ సన్నాహించింది. కష్టాలే భోంచేస్తూ, యాతనలే వంజుకుంటూ, ఇబ్బందుల బరువు కింద నలిగిపోతూ... ఛీ ఛీ, ఏం బతు కిది? బతికితే ఏ కొరత లేకుండా విశ్రాంతిగా, నిత్యానందంగా బతకాలి. అలా బతకడానికి వీల్లేనప్పుడు చిరిగి మాసిన బట్టను అవతలికి గిరవాటు పెట్టేసినట్టుగా ఈ బతుకు నుంచీ తప్పుకోవాలి. తెంపు ఒకటే ఉండాలేకానీ, అందుకు పట్టేదంతా ఎంత సేపు? ఒక క్షణం చాలు.

ఏదైనా అఘాయిత్యం చేయాలన్న నిర్ణయం నన్ను రోడ్డుపైకి నెట్టుకొచ్చింది. కళ్ళు మూసుకుని రోడ్డు కడ్డదిడ్డంగా నడిచాను. ఏ బస్సయినా దయ తలుస్తుందేమోనని ఆశించాను. కార్ల కడ్డంగా పరుగుదీసి చూశాను. ఏ ఆటో అయినా అక్కరకు పనికొస్తుందేమోనని ప్రయత్నించాను. చివరికి రోడ్డు వాహనాలను నమ్ముకుని లాభం లేదనుకున్నాను. రైలు చక్రాలయితే బెస్టు ...

సరిగ్గా ఆ సమయంలో ముకు పుటాలకు సంతర్పణగా, నోట చెమ్మూరేటట్టుగా ఓ కమ్మని వాసన వచ్చి ఒక్క పెట్టున నన్ను చుట్టుముట్టేసింది. తల పైకెత్తి చూశాను. 'అయ్యా, అమ్మా, బాబూ' అని చేతులు చాపుతున్న బిచ్చగాళ్ళతోబాటుగా అప్పుడు నేను మీ హోటలు ఎదుట నిలబడి ఉన్నాను.

అంతవరకు నేను నా బుద్ధి, నా మనస్సు, నా శరీరం—అన్నీ నా చెప్పు చేతల్లోనే ఉన్నా యనుకున్నాను. ఒకటే క్షణంలో అవన్నీ కలిసి తిరుగుబాటు ప్రకటించేశాయి. మరు క్షణంలో నేను హోటల్లోకి దూసుకొచ్చేశాను ...

సాయంకాలపు ఉపాహారా లందిస్తున్న సందడిలో ఓ అబ్బాయి, 'ఏం కావాలి?' అంటూ దగ్గరికి వచ్చేశాడు. నేను గ్రుక్కిళ్ళు మ్రింగుతూ ఉండగానే పెద్ద పట్టిక ఒకటి ఒప్పజెప్పాడు. అందులోనుంచీ పలానాది కావాలా అని మళ్ళీ లలడే అడిగాడు. మౌనమే అంగీకారంగా భావించి దాన్ని తెచ్చి పెట్టేశాడు. ఆ తరవాత ఇంకొకటి. అలాగే మరొకటి. దోశె ... పూతాప్పం ... రవా యిడ్లీ ... గిరి దాటనే కూడదు. ఒకసారి దాటిన తర్వాత ఇంక వెనుకా ముందూ చూచేదేముంది? నిండా మునిగితే చలే ఉండదు గదా! పూరీ, పెసరట్టు, కాఫీ ...

నా వాలకం కాస్త అయోమయంగానే కనిపించి ఉండాలి. బిల్లు తీసుకొచ్చి నా చేత బెట్టిన తర్వాత కూడ, హోటలు కుర్రాడు నన్ను ఒక కంట్ల కనిపెట్టి ఉండడం నేను గమనించాను.

పరగసుపున ఉపాహారాలు తిన్నందువల్ల నేమో, లేచి నిబ్బునేసరికి మత్తు పదార్థాలు సేవించినట్టుగా నేను తూలిపోతున్నాను. ఎలాగో నన్ను నేను నిలవరించుకుంటూ ముఖ ద్వారం దాకా వచ్చేశాను.

ఇప్పు డిక గుమ్మం దాటితే జరగబోయే రభ సేమిటో నాకు తెలుసు.

అప్పటికప్పుడు నేను రభసనుగానీ, రగడనుగానీ ఎదుర్కొనే స్థితిలో లేను.

అటూ ఇటూ చూసి మీ బల్లకెదురుగా ఉన్న సోఫాలో కూలబడిపోయాను.

మీరు నా వైపు నిఘా పెట్టి చూస్తున్నారని నేను గమనించకపోలేదు.

అగ్ని పర్వతంపైన కూర్చున్నానని తెలుసు. అది ప్రేలబోతున్నదనీ తెలుసు. అంతవరకూ చెక్కు చెదర కుండా ఉండాలన్నది నా ప్రయత్నం.

కళ్ళు మూతలు పడ్డాయి. స్మారకం గూడా తప్పినట్టుంది. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి మీరు భుజం పైన చెయ్యి వేసి వూపిపారేస్తున్నారు.

'ఇదిగో, ఏమయ్యా నిన్నే! పడుకుని నిద్రపోవడానికి ఇదేమైనా సత్రమనుకున్నావా? బిల్లు గూడా కింద పారేశావే! ఏదీ డబ్బు?'

దర్శించడానికి ఒక రసవత్తరమైన సన్నివేశం తయారై పోయినట్టు, ఇంతలో నా చుట్టూ పది మంది వ్యక్తులు ప్రోగైపోయారు.

'ఏ వూరయ్యా నీది? బుద్ధుండక్కర్లా?'

'మళ్ళీ పెద్దమనిషల్లే ఉన్నాడు చూడ్డానికి!'

'చూస్తారేమండీ! నాలు గంటించక ...'

'పిలీసుల్ని పిలిపించక పోయారా?'

'మాట్లాడడేమండీ మొద్దుపీనుగ!' మీరు కోపంతో రుసరుసలాడి పోతున్నారు.

నాకు ఏడుపొచ్చింది. ఒక్కొక్క సందర్భంలో ఏడవడానికి, నవ్వడానికి అట్టే తేడా ఉండదంటారు. ఏడుపు నెలాగో దిగ మ్రింగేశాను. ఆ పనిలో కృతకృత్యుడినైన తర్వాత బిగ్గరగా గొంతెత్తి నవ్వాలనిపించింది.

'శాంతం, శాంతం. అయ్యా ప్రొప్రయిటరు గారూ! శాంతించండి. డబ్బిచ్చి భోజనం చేయడం, తిన్న వాటికి డబ్బు చెల్లించడం—ఇది హోటల్లో మాములు రూలు. ఒప్పుకుంటాను. కానీ మాములు పరిస్థితి కాదు, సార్, ఇది. ఎమర్జెన్సీ! ఆకలి పొట్ట దగ్గర అన్ని నియమాలూ పెనుమంటలో గడ్డిపోచలు. మునుపటికొకసారి యిలాగే ఒక విషమ పరిస్థితి దాపురిస్తే, విశ్వామిత్రుడనే మహర్షి కుక్కమాంసం తిన్నాడట—అదీ దొంగిలించి! తప్పుకోండి సార్! తప్పుకోండి! ఎమర్జెన్సీ ఏర్పడకుండానే ఉండాలి. ఏర్పడిందా... మీ బోడి రూల్సు సుడిగాలిలో ఎండుటాకుల్లా కొట్టుకుపోతాయి' అని చెప్పదలచుకున్నాను. కానీ చెప్పలేదు. ఇప్పుడు చెప్పేశాను గదండీ! సెలవు.

చిత్తగించవలెను,
డోక్కా జోగిరాజు."

ఉత్తరం చదివి తల పైకెత్తారు ప్రొప్రయిటరుగారు.

"సార్! మీకో మనియార్డరు రుందండీ—ఏడు రూపాయలా ఇరవై ఐదు పైసలకు" అన్నాడు పోస్టుమేన్. ★

